క్లుప్తంగా

పేదలకు చీరల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సతీష్‌నాయుడు

బలిజిపేట: మిర్తివలస గ్రామంలో వంద మంది పేదలకు సంక్రాంతి సందర్భంగా చీరలు, దుస్తులను గ్రామానికి చెందిన వి.సతీష్‌నాయుడు శనివారం పంపిణీ చేశారు. పేదలకు తన వంతు సాయంగా వీటిని అందజేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వి.త్రినాధ నాయుడు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అపరాలకు మంచుదెబ్బ



వెంకటాపురంలో ఏపుగా పెరిగిన పెసర చేను

సీతానగరం: మండలంలోని రబీ పంటగా సాగు చేస్తున్న అపరాల పంటలపై మంచు దెబ్బ పడింది. వారం రోజులుగా కురుస్తున్న పొగ మంచు వల్ల పూత దశలో ఉన్న పెసర, మినుమ చేలకు బూడిద తెగులు, పేను బంక పురుగు ఆశించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లతో పాటు బంగారు తీగ అల్లుకుపోవడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచు ప్రభావంతో అపరాల దిగుబడి బాగా తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



వాహన చోదుకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ కె.నీలకంఠం అన్నారు. మండల కేంద్రంలోని సువర్ణముఖి నది సమీపంలో సిబ్బంది సహకారంతో బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. వాహన చోదకులు అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సంక్రాంతి వేళ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు.

అగ్ని బాధితులకు అండగా...



అగ్ని బాధితులకు వంటపాత్రలు పంపిణీ

సీతానగరం: మండల కేంద్రంలోని గూడెం వీధిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు పలువురు దాతలు తమ వంతు సాయం అందజేశారు. ప్రమాదంలో నష్టపోయిన ఏడు కుటుంబాల వారికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎల్‌ఎన్ ప్రసాద్ వంట పాత్రలు, బకెట్లు, బిందెలు, స్టీలు పాత్రలు శనివారం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా, మండల శాఖ నాయకులు ఎం.విశ్వేశ్వరరావు, ఏవీ సత్యనారాయణ మూడు రోజులకు సరిపడ నిత్యావసరాలు అందజేశారు. తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో ఆర్‌ఐ కరుణాకర్, వీఆర్‌ఓలు కుమార్, సింహాచలం వంద కేజీల బియ్యం పంపిణీ చేశారు. పెదబోగిలి సర్పంచ్ జె.తేరేజమ్మ, ఉప సర్పంచ్ అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచు దుప్పటి



చెముడు రహదారిలో కురుస్తున్న మంచు

మక్కువను మంచు దుప్పటి కప్పేసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం పది గంటల వరకు పొగ మంచు విపరీతంగా కురిసింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రహదారులన్నీ మంచుతో కప్పుకుపోయాయి. పంట పొలాలు, చెరువులు, ఇళ్లన్నీ కనిపించనంతగా మంచు కురిసింది.

– మక్కువ

సంబరంగా భోగి

భోగి పండుగను శనివారం ఘనంగా జరిపారు. సంక్రాంతి ముందు రోజు వచ్చే భోగి పండుగ వేళ పల్లెలు, పట్టణాలు భోగి మంటలతో సందడిగా మారాయి. సంప్రదాయాల నడుమ వేకువజాము నుంచే మంటలు వేసి పిల్లలు, పెద్దలు సందడి చేశారు. భోగి పిడకలు మంటల్లో వేసి చిన్నారులు కేరింతలు కొట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: సంగంవలస గ్రామంలో...



పార్వతీపురం టౌన్: పట్టణంలో భోగి మంట



బలిజిపేట: వెంగాపురంలో..

ప్రజలకు ఎమ్మెల్యే జోగారావు సంక్రాంతి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజలంతా సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సంక్రాంతి వేళ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. తెలుగు వారింట సంక్రాంతి వెల్లివిరియాలని, ప్రతి ఇంట సరికొత్త కాంతులు నింపాలన్నారు.

అ'పూర్వ' కలయిక



పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

పార్వతీపురం టౌన్: పూర్వ విద్యార్థుల కలయిక సందడిగా సాగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన ఎమ్మార్ నగరం జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థులు పాఠశాల వద్ద శనివారం ఒకేచోట చేరుకొని తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. 1998లో విద్యను అభ్యసించిన వారు ఆత్మీయ కలయిక సందర్భంగా ఒకేచోట చేరి ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. భవిష్యత్‌లో ఇంతటి స్థానానికి చేర్చిన తమ గురువుల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. సంక్రాంతికి స్వగ్రామాలకు చేరుకున్న వారంతా పాఠశాల, గ్రామాల అభివృద్ధికి తోడ్పడేందుకు నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో మన్మధరావు, చీకటి వరప్రసాద్, ఆదినారాయణ, రాధాకృష్ణ, చిత్రంజన్, భాస్కరరావు, శ్రీను, గౌరీశంకర్, నరేంద్ర, నీలిమ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

పార్వతీపురం టౌన్: దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన ఉపకరణాలను డీఈఓ కార్యాలయం వద్ద ఆయన శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు అండగా నిలుస్తుందన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఉపయోగపడేలా జిల్లాకు 490 ఉపకరణాలు అందజేసిందన్నారు. రూ.30లక్షల విలువ గల ట్రైసైకిళ్లు, 35 వీల్‌ఛైర్లు, 15 యంత్రాలు, 222 టీఎల్‌ఎం కిట్లు, 228 హియరింగ్ మిషన్లు, బ్రైలీ కిట్లు 15 ఉపకరణాలను విద్యార్థులకు అందజేసినట్టు తెలిపారు. పాఠశాలల ఆధునికీకరణకు నాడు – నేడు రెండో విడత పనుల్లో భాగంగా 414 పాఠశాలలకు రూ.144.60కోట్లు మంజూరు చేసిందన్నారు. పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈడీ కోఆర్డినేటర్ భానుమూర్తి, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా మూర్తికి సత్కారం



హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తికి పట్టణ పెద్దలు, పోలీసుస్టేషన్ సిబ్బంది శనివారం సత్కరించారు. ప్రతీ నెల తన వేతనంలో కొంత భాగాన్ని పేదలకు, వృద్ధులకు, విద్యార్థులకు కేటాయించి సేవా కార్యక్రమాలు చేపడుతుండడంతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌సీ కృష్ణమూర్తి మాట్లాడుతూ అబ్దుల్ కలామ్, మదర్ థెరీసాలను గురువులుగా భావించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని తెలిపారు. తాను పదవీ విరమణ పొందిన తరువాత వచ్చిన మొత్తంలో కొంత భాగాన్ని కేటాయించి పాఠశాల ప్రారంభించి పేద విద్యార్థులకు విద్యను అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.సత్యన్నారాయణ, ఎస్.ఉదయకుమార్, పట్టణ, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాలాడలో ఏనుగుల సంచారం



మొక్కజొన్న పంట వైపు దూసుకువస్తున్న ఏనుగులు

భామిని:

మండలంలోని తాలాడ గ్రామంలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. శనివారం ఓ ఆరేడు ఏనుగులు కలిసి అక్కడి మొక్కజొన్న పంటను ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు బి.సంజీవరావు, బి.కిరణ్‌కుమార్ తెలిపారు. గజరాజుల రాకతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు



సంగంవలసలో ముగ్గులు పోటీల్లో పాల్గొన్న మహిళలు

పార్వతీపురం టౌన్: మండలంలో సంక్రాంతి పండుగ సాంప్రదాయ క్రీడల్లో భాగంగా సంగంవలస, ఎన్.ములగ, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో చైర్‌గేమ్, ముగ్గులు, నృత్య పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో మహిళలు, యువత పాల్గొన్నారు. చిన్నారులు నృత్య ప్రదర్శన చేయగా, మహిళలు రంగవల్లులు వేశారు.



సంగంవలసలో క్రికెట్ పోటీల్లో గెలుపొందిన యువత

మన చేతుల్లోనే మన ఆరోగ్యం



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్న విషయం ప్రజలు గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో ఆయన గృహంలో గ్రీన్ వరల్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒమిక్రాన్ బీఎఫ్ 7 పై అవగాహన ఫ్లెక్సీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మాస్కు ధరించడం, బూస్టర్ డోస్ వేసుకోవడం, వీలైనంత వరకు భౌతిక దూరం పాటించడం వంటి కోవిడ్ నియమాలు పాటించాలని కోరారు. కోవిడ్ 19 వెరియంట్ బీఎఫ్ 7 నుండి రక్షణకు ప్రజలు భాద్యతగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు, నాయకులు సంతోష్‌కుమార్ శర్మ, పిరిడి రామక్రిష్ణ, పిట్ట వాసు, సురేష్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీతానగరం: మండలంలోని ఇప్పలవలస గ్రామంలో శనివారం రాత్రి వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సంస్థ ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో ఏటా భోగి పండుగ రోజున స్వామి వారి కల్యాణం చేయడం ఆనవాయితీ. లోక కల్యాణార్థం నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



బలిజిపేట: వెంగాపురం రామాలయంలో గోదాదేవి, రంగనాథం కల్యాణం



పార్వతీపురం టౌన్: శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం



సాలూరు: గోదాదేవి కల్యాణం

బలిజిపేట: మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాల వద్ద గోదాదేవి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా కల్యాణాన్ని నిర్వహించారు. వెంగాపురం రామాలయంలో అర్చకులు గోపాలకృష్ణ, కె.సూర్యనారాయణ, కె.ఫణికుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అమ్మవారి కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: ధనుర్మాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాధస్వామిల కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు జగన్నాధాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది ధనుర్మాసంలో 30 రోజుల పాటు సాగే శ్రీ ఆండాల్ అమ్మవారి తిరుప్పావై పఠనం అనంతరం గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసం ముగుస్తుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

సాలూరు: పట్టణంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఇండియన్ హెర్క్యులస్‌కు ఘననివాళి



కోడి రామ్మూర్తినాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న తెలగవీధి ప్రజలు

వీరఘట్టం: పట్టణంలోని తెలగవీధిలో ప్రపంచ మల్ల యోధుడు, ఇండియన్ హెర్క్యులస్ కోడిరామ్మూర్తి నాయుడు వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి వీధి ప్రజలు పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం కళియుగ భీముడిగా పేరొందిన కోడిరామ్మూర్తి జీవిత చరిత్రలోని ముఖ్య సంఘటనలు, ధైర్యసాహస కృత్యాలను వక్తలు వివరించారు. అలాగే ఎమ్మార్సీ, జెడ్పీ హైస్కూల్ వద్ద కూడా కోడిరామ్మూర్తినాయుడు వర్ధంతి నిర్వహించి, నివాళులర్పించారు.

వస్త్రదానం



పేదలకు బట్టలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న జల్లు నారాయణరావు

పాలకొండ రూరల్: పట్టణంలోని పేదలకు గీతాపారాయణ సభ్యుడు జల్లు నారాయణరావు శనివారం వస్త్రదానం చేశారు. మానవ సేవే మాధవ సేవ అని పండగ పూట నిరుపేదలకు ఇలా దుస్తుల పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని దాత అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తుమ్మగుంట శంకరరావు, కడగల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



సీతంపేట: వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న గడ్డెయ్య

సీతంపేట: మండల కేంద్రంలోని వృద్ధులకు యువమిత్ర సర్వీస్ సొసైటీ డైరెక్టర్ గొర్లె గడ్డెయ్య శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతిఏటా భోగి పండగ సందర్భంగా వీటిని అందిస్తుండడం చాలా ఆనందంగా ఉందని దాత అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు గొర్లె సుజాత, కో–ఆర్డినేటర్ గంధవరపు అప్పలనరసమ్మ పాల్గొన్నారు.